క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: మండలం లోవకొత్తూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఈ నెల 25 వరకూ దరఖాస్తులు తీసుకుంటామని, 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు.

ఖాళీలు

ఆరో తరగతిలో ఎస్సీ–తొమ్మిది, ఎస్టీ ఒకటి, ఓసీ ఒకటి ఖాళీలు ఉన్నాయన్నారు. ఏడో తరగతిలో ఎస్సీ రెండు, ఎస్టీ రెండు, ఓసీ ఒకటి, ఎనిమిదో తరగతిలో ఎస్సీ ఒకటి, ఎస్టీ ఒకటి, తొమ్మిదో తరగతిలో ఎస్సీ ఒకటి, ఓసీ ఒకటి ఖాళీలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకుని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



జగపతినగరంలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

కిర్లంపూడి: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జగపతినగరం గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధికారులకు సూచించారు. జగపతినగరం డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయి రోడ్డుపైకి రావడంపై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఆదేశాలతో శుక్రవారం పంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పలు వీధులలో కుళాయిలకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. డ్రైన్లను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, అడారి శివనారాయణ, కాళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ యాక్ట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి



జగ్గంపేటలో ఐక్యత చాటుతున్న కార్మికులు

జగ్గంపేట: స్థానిక పెంకుల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు లేబర్ యాక్ట్ ప్రకారం జీతాలు చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏసు డిమాండ్ చేశారు. స్థానిక బాలాజీ టైల్స్‌లో పని చేస్తున్న కార్మికుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాలను తిరిగి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు గంటా బాలరాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో సూర్యదేవుని గ్రామోత్సవం



కొత్తపల్లిలో సూర్యదేవుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం సూర్యదేవుని గ్రామోత్సవం ఘనంగా జరిగింది. సనాతన ధర్మప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో గ్రామంలో ఉషాపద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ఊరేగించారు. విశేష సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొని ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా, ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, సభ్యులు గుర్రాల వేంకటేశ్వరరావు, మార్నీడి రంగబాబు, చల్లా రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రమాణ స్వీకారం



ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శుక్రవారం శాసనసభలో ప్రమాణస్వీకారం చేశారు. ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఎమ్మెల్యేతో ప్రమాణస్వీకారం చేయించారు.



వి.కొత్తూరు కేజీబీవీలో యోగా డే ఆకారంలో ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు



ఏలేశ్వరంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



చిల్లంగి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

సంపూర్ణ ఆరోగ్య యోగం

- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- ఆసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

తుని రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, శరీర దృఢత్వం లభిస్తాయని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. పీఈటీ అర్చన ఆధ్వర్యంలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. ఆంగ్ల అక్షరమాలలో విద్యార్థినులు యోగా ఆకారంలో ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఎన్నో రకాల వ్యాధులు దరిచేరవన్నారు. శరీర దృఢత్వం పెరుగుతుందన్నారు. నిత్యం యోగాసనాలు చేస్తే జీవిత కాలం పెరుతుందని చెప్పారు. యోగా దినచర్యగా చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు, యువకులు యోగా సాధన చేశారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక పిరమిడ్ కేంద్రంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంగా జరుపుకొనేందుకు ఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపిందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయాలన్నారు. యోగా సాధనతో కొన్ని రోగాలు నయం అవుతాయన్నారు. స్థానిక సాయిబాబా మెట్ట వైఆర్‌పీ అతిథిగృహం వద్ద యోగా సాధన కమిటీ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో శేషగిరి పట్నాయక్, వాగు బులియల్లంరాజు, జక్కా లక్ష్మీప్రసాద్, గునిశెట్టి శ్రీనివాసరావు, వాగు గున్నబాబు, అశపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

మంచి ఆరోగ్యం

కోటనందూరు: యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం సాధించవచ్చని ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. జగన్నాథపురం ఎంపీయూపీ, స్థానిక శ్రీసరస్వతీ విద్యానికేతన్, బొద్దవరం హైస్కూల్లో జరిగిన యోగా డే వేడుకల్లో ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, స్థానిక పెద్దలతో కలిసి యోగా చేశారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ లెక్కల స్వామినాయుడు, హెచ్ఎం సీహెచ్ వెంకటరమణ, యోగా గురువు లెక్కల సత్యనారాయణ, సరస్వతీ విద్యానికేతన్ అధినేత బంటుపల్లి అచ్చారావు, ఉపాధ్యాయులు ఎం.రమణమూర్తి, మహేశ్వరి, పీడీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఆరోగ్యం

ప్రత్తిపాడు: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సమకూరుతుందని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ బి.స్వప్న అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. స్థానిక సీహెచ్‌సీ వద్ద ర్యాలీని డాక్టర్ స్వప్న ప్రారంభించారు. మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. చిల్లంగి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు డి.నవరోజీ, మర్రా అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. సోమవరం గ్రామంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేశారు.

మానసిక వికాసం

యోగా ద్వారానే మానసిక వికాసం సాధ్యమని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుకూరి మధుబాబు, కోర్టు ప్యానెల్ అడ్వకేట్లు బుగత శివ, ఆకాశపు నాగమల్లేశ్వరరావు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక మినర్వా సంస్థల ఆవరణలో యోగా గురువు తాతపూడి బుజ్జి విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు.

జగ్గంపేట: ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, విద్యార్థులు యోగాను అలవాటుగా మార్చుకోవాలని జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ సూచించారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సాహితీ స్కూల్‌లో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. యోగాసనాలు వేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా టీచర్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు.

సంపూర్ణ ఆరోగ్యం

శంఖవరం: విద్యార్థులకు చదువుతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల, జి.కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు వివిధ భంగిమల్లో యోగాసనాలు వేశారు. అలాగే కొంతంగిలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

మానసిక ప్రశాంతత

తుని: యోగాను దినచర్యగా మార్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక గణపతినగర్ లౌలీ పార్కులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ గీతారామకృష్ణతో పాటు పట్టణంలోని 10 మంది యోగా గురువులు హాజరై యోగా విశిష్టతను వివరించారు. యోగాను జీవితంలో ఓ భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా గురువులను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కుచ్చర్లపాటి భీమరాజు, కేఎస్ఎన్ సత్యనారాయణ, ఆంజనేయ ప్రసాద్, నూకయ్యశెట్టి, నెల్లిపూడి రాజబాబు, ఆశిన సత్యనారాయణ, జేసీఐ క్లబ్, వాకర్స్ క్లబ్, బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తొండంగి మండలంలో...

తొండంగి: యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతోందని యోగా గురువు జి.సత్యనారాయణ అన్నారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు సత్యనారాయణ విద్యార్థులకు పలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సూర్యనమస్కారాలు, ప్రాణాయామం చేయడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, అధ్యాపకులు యోగా గురువు సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యావేత్త దాసం శేషారావు అన్నారు. మండలంలోని ధర్మవరంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాణి, సుజాత, శివ, చంద్రరాణి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.



వి.కొత్తూరు కేజీబీవీలో యోగాసాధన చేస్తున్న విద్యార్థినులు



తునిలో యోగా గురువులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



కోటనందూరులో విద్యార్థులతో యోగా చేయిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తి కాటం భాను



జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు



సీతంపేటలో దుర్గమ్మవారికి ప్రత్యేక అలంకరణ

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు హనుమంతువజ్ఝల అవధాని, ఉపాధ్యాయుల రమేష్, అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణిశర్మ, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

నేడు వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శనివారం వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ అధికారులు తెలిపారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

శంఖవరం: మండలంలోని సీతంపేటలో వేంచేసిన మీనాక్షి దుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేష్ఠ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులు భజనలు చేశారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

ఏలేశ్వరం: లింగంపర్తి పరిధిలోని కొండతిమ్మాపురంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. కొండతిమ్మాపురంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

పిడుగు పాటుకు గేదె మృతి



బిళ్లనందూరులో పిడుగు పాటుకు మృతి చెందిన గేదె

కోటనందూరు: పిడుగుపాటుకు చూడి గేదె మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బిళ్లనందూరు గ్రామానికి చెందిన సుర్ల యర్రయ్య తన చూడి గేదెను మేతకు పొలాల్లోకి తోలుకెళ్లాడు. శుక్రవారం ఉదయం నుంచి తీవ్ర ఉక్కబోతగా ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గేదె మేత మేస్తున్న ప్రాంతంలో పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు యర్రయ్య తెలిపారు.

ముగిసిన వరమహాలక్ష్మి కల్యాణోత్సవాలు



తుని చిట్టూరి మెట్రోలో వరమహాలక్ష్మికి పూజలు చేస్తున్న వేద పండితులు

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వైకుంఠ నారాయణ సమేత వరమహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్యార్చన, సేవాకాలం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, చూర్ణోత్సవం, చక్రతీర్థస్నానం, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో తుని, పాయకరావుపేటకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఉచిత ఆర్థో వైద్య శిబిరం

తుని: స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో శుక్రవారం ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం అపోలో హాస్పటల్ రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర 140 మందికి బీఎండీ (బోన్ స్ట్రెంత్) వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఎక్స్‌రే తీయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ కీళ్ల నొప్పుల నివారణ, ఎముకల పటిష్టానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కేఎస్ఎల్ఎస్ వర్మ, కిషోర్‌రెడ్డి, కె.ఈశ్వర్, వైద్యులు ప్రసాద్, ఎస్‌వీ సుబ్బారావు, ఎస్. వీర్రాజు, ఎం.వివేకానంద్, టి.నాగిరెడ్డి, యం.నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవిచంద్ర

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



తిరుమాలిలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు అందజేసిన ఐసీడీసీ సిబ్బంది



రాచపల్లిలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి, జె.అన్నవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తిరుమాలిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఎంఈఓ–2 వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లు నిండిన 16 మంది పిల్లలను ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగారత్నం, ఉపాధ్యాయుడు తూమురొతు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జె.అన్నవరంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి, రాచపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ చక్రవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలల్లో, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది దమయంతి, పి.రత్న, పద్మ, రత్నం మేరీ, ఎం.సరస్వతి, జయలక్ష్మి పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

తొండంగి: స్థానిక మెయిన్ రోడ్డులో శుక్రవారం పూరి గుడిసె దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గాబు రాజు గ్రామశివారులో రైసు మిల్లు స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అక్కడ గెస్ట్‌హౌస్(హట్) నిర్మించుకుని వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు అక్కడకు వచ్చి తమపై దాడి చేసి గుడిసెను తగులబెట్టారని బాధితులు గాబు రాజు, గాబు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తుని రూరల్ ఎస్సై రమేష్‌బాబు, ఇతర సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



తొండంగిలో దగ్ధమైన గుడిసెను పరిశీలించిన పోలీసులు

మండల సమావేశం

గోకవరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండలంలోని వైఎస్సార్ సీపీ, టీడీపీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. సమావేశపు హాలు ఆధునీకరించడానికి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందు, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.